నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, శనివారం 14 సెప్టెంబర్ 2024 | NAGARKURNOOL

## రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మార్చారు..


- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



కొల్లాపూర్, సెప్టెంబర్ 13 : రాష్ట్రంలో రుణమాఫీ మొదలు, కల్యాణలక్ష్మి, కొత్త పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు మొదలైన హామీల నుంచి తప్పించుకొనేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అగ్ని గుండంగా మారుస్తోందని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ పార్టీ కొత్త నాటకానికి తెరలేపిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానికంగా ప్రజల విశ్వాసం కోల్పోయారని, అతి తక్కువ కాలంలోనే ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నదని విమర్శించారు. పెంట్లవెల్లి సొసైటీలో జీరో రుణమాఫీపై స్పందించని కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ నాయకులు రాష్ట్రంలో గందరగోళం సృష్టించేందుకు కార్యకర్తలను రెచ్చగొడుతున్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరి మార్చుకొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

*బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్ట్ చేయడంపై నేతలు భగ్గుమన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మరో ఎమ్మెల్యే గాంధీ మధ్య వివాదం నెలకొన్న నేపథ్యంలో గురువారం గులాబీ పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను అరెస్ట్ చేసిన విషయం విధితమే. ఈ అక్రమ నిర్బంధాలను నిరసిస్తూ మాజీ మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం హైదరాబాద్‌లో తలపెట్టిన నిరసనకు పెద్ద ఎత్తున వెళ్తున్న నాయకులను పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. అర్ధరాత్రి నుంచే అరెస్టుల పర్వం మొదలుపెట్టి ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించి దిగ్బంధించారు. వెల్దండ మండల కేంద్రంలో అరెస్టులను నిరసిస్తూ జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. ప్రభుత్వ తీరుపై పలువురు మండిపడ్డారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక కాంగ్రెస్ నేతలు నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు.*

*- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 13*



మూసాపేట పోలీస్‌స్టేషన్ వద్ద నినాదాలు చేస్తున్న నేతలు

# నిర్బంధం

- ఉమ్మడి జిల్లాలో అడుగడుగునా నేతల అరెస్ట్
- అర్ధరాత్రి నుంచే అక్రమంగా స్టేషన్లకు తరలింపు
- పీఎస్‌ల వద్ద నిరసన తెలిపిన గులాబీ శ్రేణులు
- రేవంత్ సర్కారుపై ఆగ్రహం
- హైదరాబాద్‌కు కదిలిన బీఆర్‌ఎస్ నేతల అడ్డగింత



నారాయణపేట జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు



వనపర్తి జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, నాయకులు







నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు, మాగనూరు పోలీస్‌స్టేషన్‌లో ముందస్తు అరెస్ట్ అయిన నేతలు, ఖిల్లాఘణపురం పోలీస్‌స్టేషన్‌లో..



ఆయిల్‌పాం సాగుపై అధికారులకు సూచనలిస్తున్న మంత్రులు తుమ్మల, జూపల్లి

## రైతన్న, నేతన్న రెండు కండ్లు

- సాగు చేస్తున్న భూములకు మాత్రమే రైతు భరోసా
- ఏడాదిలోగా బీచుపల్లి ఆయిల్ మిల్లు ప్రారంభిస్తాం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి హాజరైన మంత్రి జూపల్లి

అలంపూర్/ఉండవెల్లి/ఎర్రవల్లి చౌరస్తా, సెప్టెంబర్ 13 : రాష్ట్రంలోని రైతన్నలు, నేతన్నలు తెలంగాణ ప్రభుత్వానికి రెండు కండ్లని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఉండవెల్లి మండలంలోని అలంపూర్ చౌరస్తా మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పుష్పమ్మ నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బింగిదొడ్డి దొడ్డప్ప, వైస్‌చైర్మన్ పచర్లకుమార్‌తోపాటు 14మంది డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి జూపల్లితో కలిసి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గంలోని వ్యవసాయ భూములు బంగారు పంటలు పడించేందుకు అనువుగా ఉన్నాయన్నారు. రైతులు లాభసాటి పంటలు పండించి అధిక దిగుబడితోపాటు అధిక లాభాలు ఆర్జించాలి, గద్వాల, అలంపూర్ రైతులు పండించిన పత్తి విత్తనాలకు దేశంలో మంచి డిమాండ్ ఉందని గుర్తు చేశారు. అలంపూర్ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందాలంటే ఆర్డీఎస్‌తో పాటు తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, మల్లమ్మకుంట రిజర్వాయర్ పనులు పూర్తి చేయడంతోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రాష్ట్రంలో 42 లక్షల మంది రైతులు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు పొందారు. ఇప్పటి వరకు 20 లక్షల మందికి రుణమాఫీ చేయడం జరిగిందని, రాష్ట్రంలో ఎన్ని కష్టాలున్న వందశాతం రైతు రుణమాఫీ చేసి తీరుతామన్నారు. అదేవిధంగా పంటలు సాగు చేస్తున్న భూములకు మాత్రమే రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ.15 వేలు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరుగుతుదన్నారు. రైతులు సాగు చేసే ప్రతి పంటకు బీమా డబ్బులను ప్రభుత్వం చెల్లించడం తోపాటు ఒక ఎకరా పంట సాగుకు రూ.1.50 లక్షలు వచ్చే విధంగా చూస్తామన్నారు. ఆయిల్‌పాం తోటలు సాగు చేస్తున్న రైతుల సౌకర్యార్థం వచ్చే సంవత్సరం నాటికి బీచుపల్లి ఆయిల్ మిల్లును ప్రారంభిస్తామని చెప్పారు. అదేవిధంగా అలంపూర్ చౌరస్తాలోని వంద పడకల దవాఖానను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని, అయిజ మండలంలో సబ్ మార్కెట్ యార్డును నూతన యార్డుగా చేసి కమిటీ నియమిస్తామని, 98 జీవో ద్వారా శ్రీశైలం ముం పు నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు దక్షిణకాశీగా పేరు గాంచిన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో కలిసి దర్శించుకున్నారు.

అదేవిధంగా ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి విజయ ఆయిల్ మిల్‌లోని ఆయిల్‌పాం నర్సరీని మంత్రులు పరిశీలించి ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సంతోష్‌తోపాటు వ్యవసాయాధికారులకు సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ సంతోష్‌కుమార్, ఎస్పీ శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు కార్యదర్శి ఎల్లస్వామి, వ్యవసాయశాఖ ఏడీఏ సక్రియానాయక్, అధికారులు పాల్గొన్నారు.



రాజాపూర్‌లో పాలబిల్లుల కోసం ఆందోళన చేస్తున్న రైతులు

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- రాజాపూర్‌లో జాతీయ రహదారిపై పాడి రైతుల ఆందోళన
- వందలాది లీటర్ల పాలను పారబోసి నిరసన


బాలానగర్ (రాజాపూర్), సెప్టెంబర్ 13 : మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాజాపూర్ మండల కేంద్రంలో పాడి రైతులు ఆందోళన నిర్వహించారు. పాల బిల్లులు చెల్లించకపోవడంతో పశువుల పోషణ భారంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వందలాది లీటర్ల పాలను జాతీయ రహదారిపై పారబోసి నిరసన వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాడి రైతులు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీన పాల బిల్లులు వచ్చేవని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో నెలల తరబడిగా పాలు పోస్తున్నా బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో గ్రామంలో పదిమందికిపైగా పాడిరైతులకు పాల బిల్లులు రావాల్సి ఉందని, అధికారులను అడిగితే నేడు, రేపు అంటూ కాలం వెల్లదీస్తున్నారని, గట్టిగా నిలదీస్తే చేతులెత్తేస్తున్నారని ఆరోపించారు. లక్షలు ఖర్చుచేసి పాడిపశువులను ఖరీదు చేసి పోషిస్తున్నామని, ఇటీవల వర్షాలకు పాడి పశువులు అనారోగ్యం పాలైతే వైద్యం కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. పాడి రైతులకు బీఆర్‌ఎస్ నాయకులు బచ్చిరెడ్డి, శ్రీశైలం యాదవ్ తదితరులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతులకు బిల్లులు చెల్లించడంలో విజయ డెయిరీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. మండలంలోని పాడి రైతులకు మూడు నెలలుగా రూ.రెండున్నర కోట్లకు పైగా పాల బిల్లులు చెల్లించాల్సి ఉందని, ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించాలని లేనిచో పాడి పశువులతో జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన పాడి రైతులు పాల్గొన్నారు.

## సైబర్ నేరస్తుడి అరెస్ట్

- తెలుగురాష్ట్రాల ప్రజలను మోసగించిన ఘనుడు
- రెండు కార్లు, ఇంటి ప్లాట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు

కొత్తకోట, సెప్టెంబర్ 13 : మూడు, నాలుగేండ్ల నుంచి రెండు రాష్ట్రాలకు సంబంధించిన అమాయక ప్రజలను ఇండియా బుల్స్, ధని, ముద్ర లోన్ పేరుతో సైబర్ క్రైం ద్వారా దోచుకుంటున్న కరుడు గట్టిన నేరస్తుల్లో ఒకరైన ముడావత్ కిషన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్ చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నిందితుడికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. సైబర్ క్రైం కేసులో ఆగస్టు 29న ప్రధాన సూత్రదారి అయిన నర్సింగ్‌నాయక్, కురుమూర్తి, రాత్లావత్ రమేశ్, ఇస్లావత్ రాములు, కొత్తపల్లి ఉమేశ్ వీరితోపాటు ఇద్దరు మైనర్లను పెద్దమందడి మండలంలో అరెస్టు చేసి జైలుకు పంపించినట్లు చెప్పారు. సెప్టెంబర్ 12న పామిరెడ్డిపల్లితండాకు చెందిన ముడావత్ రమేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసు పరిశోధనలో భాగంగా విచారించగా మరో నేరస్తుడు ముడావత్ కిషన్ పెద్దమందడి మండలం ముందరితండాలో పట్టుకొని విచారించగా కతార్, సౌదీఅరేబియాలో దేశాల్లో 2012 వరకు మేస్త్రీగా పనిచేశారు. తరువాత 2013 సంవత్సరంలో ఇండియాకు వచ్చి మామిడి మాడకు చెందిన సునీతను వివాహం చేసుకున్నాడు. పెండ్లి తరువాత గల్ఫ్ దేశాలకు వెళ్లి 2020 వరకు అక్కడే ఉన్నాడు. ఇండియాకు తిరిగి వచ్చిన తరువాత హైదరాబాద్‌లో ఆటో నడిపేవాడు. తన చిన్న తమ్ముడైన రాకేశ్ ద్వారా వడావత్ రమేశ్, చెట్కి రమేశ్ సైబర్ నేరాలు చేస్తున్నారని తెలుసుకున్నాడు. వారికోసం బిహార్ రాష్ట్రంలోని పాట్నాకు వెళ్లి వడావత్ రమేశ్, చెట్కి రమేశ్, హరీశ్, నరేశ్ సహకారంతో సైబర్ నేరాల్లో పాలుపంచుకొని డబ్బులు సంపాదించాడు.

ఇక్కడికి వచ్చిన అనంతరం కూడా ముద్ర, ఇండియా బుల్స్, ధని అనే లోన్స్ పేరుతో సైబర్ నేరాలకు పాల్పడి అమాయక ప్రజలను మోసం చేసి దాదాపు రూ.కోటి రూపాయలతో వనపర్తిలో రెండు ప్లాట్లు కొనుగోలు చేశాడన్నారు. అదేవిధంగా తన తండాలో రూ.65లక్షలతో ఆధునిక వసతులతో రెండు ఇండ్లు కట్టడంతోపాటు రెండు కార్లు కూడా కొన్నట్లు చెప్పారు. అరెస్టు చేసిన సమయంలో వీటితోపాటు వివిధ బ్యాంకులకు చెందిన అకౌంట్లు, మూడు మొబైల్స్, రెండు కీ ప్యాడ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని శుక్రవారం ఆత్మకూర్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. ఈ కేసు విచారణ తెలంగాణ సైబర్ సెక్రటరీ బ్యూరో షికా గోయల్, డీజీపీ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో వనపర్తి డీఎస్పీ పర్యవేక్షణలో కొత్తకోట ఎస్సై మంజునాథ్‌రెడ్డి, శ్రీరంగాపురం ఎస్సై వెంకటేశ్వర్లు సహకారంతో దర్యాప్తు చేసినట్లు వివరించారు. సమావేశంలో సెక్యూరిటీ ఇన్‌చార్జి డీఎస్పీ రత్నం, రాంబా బు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు,సీఐ రాంబాబు

# వణికిస్తున్న డెంగ్యూ

### వైద్యుల సూచనలు తప్పనిసరి..




వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు పెరిగాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల రోగాల బారిన పడకుండా చూసుకోవచ్చు. ప్రధానంగా వర్షాకాలంలో నీటి కాలుష్యం ఎక్కువ, ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా చూసుకోవాలి. ఇంటి చుట్టూ వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. దీని వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెందుతాయి. చిన్న జ్వరం, జలుబుకు పిల్లలకు యాంటిబయోటిక్స్ ఇవ్వకూడదు. వైద్యుల సూచన మేరకు మందులు వేసుకోవాలి.

*- డాక్టర్ పద్మ, డీఎంహెచ్‌వో, మహబూబ్‌నగర్*



మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలో చికిత్స కోసం వచ్చిన సీజనల్ వ్యాధిగ్రస్తులు

- పాలమూరును చుట్టుముట్టిన సీజనల్ వ్యాధులు
- జనరల్ దవాఖానకు పెరుగుతున్న రోగుల తాకిడి
- జిల్లాలో ఇప్పటివరకు 237 డెంగ్యూ కేసులు నమోదు
- నివారణ చర్యలపై అధికారుల నిర్లక్ష్యం



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 13 : ప్రస్తుతం ఏ ఇంట చూసినా దగ్గు, జలుబు, జ్వరాలతో సతమతమవుతున్న వారే కనిపిస్తున్నారు. కొన్ని రోజులుగా వాతావరణంలో వస్తున్న మార్పులతో చిన్నాపెద్దా తేడా లేకుండా చాలామంది డయేరియా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర విషజ్వరాల బారిన పడుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలు అన్నీ విషజ్వరాలతో బాధపడుతున్న వారితో నిండిపోయాయి. నెల రోజులుగా జనరల్ దవాఖానకు వచ్చే రోగుల సంఖ్య 1400 నుంచి 2 వేల వరకు పెరిగింది. ప్రైవేట్ దవాఖానల్లోనూ భారీగానే కేసులు నమోదవుతున్నాయి.

***మెరుగైన వైద్యం అందక..***

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) మెరుగైన వైద్యం అందక జనరల్ దవాఖానను ఆశ్రయిస్తున్న రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. ఇక్కడ సాధారణ జ్వరాలు, ఒంటినొప్పులు ఇతర సమస్యలకు వైద్యం అందిస్తున్నారు. అయితే నిత్యం ఎక్కువ మంది రోగులు వస్తుండడం తో వైద్యులు హడావుడిగా చికిత్స చేస్తూ చేతులు దులుపుకొంటున్నారని రోగులు వాపోతున్నారు. నాడిపట్టి పరీక్షించి రోగితో సమస్య తెలుసుకునే పరిస్థితి లేదని, సాధారణ పరీక్షలు నిర్వహించి తోచిన మందులు ఇచ్చి పంపుతున్నారని ఆరోపిస్తున్నారు.

***మొక్కుబడి చర్యలతో సరి..***

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వర్షాకాలం పక్కా ప్రణాళిక కొరవడుతున్నది. పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో రోగుల తాకిడికి అనుగుణంగా సేవలందిడం లేదు. వాన నీరు నిలిచి పొంగిపొర్లకుండా చూడాల్సిన మున్సిపాలిటీ సిబ్బంది మాత్రం మొక్కుబడి చర్యలతో సరిపెడుతున్నారు. పారిశుధ్యం, దోమల నివారణకు ఏటా సీజన్‌లో రూ.3 కోట్ల మేర ఖర్చు పెడుతున్నా ఫలితం కనిపించడం లేదు. జిల్లా కేంద్రంలో కనీసం ఫాగింగ్ మీషన్లు కూడా ఉపయోగించడం లేదు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధుల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉండగా, ఆ దిశగా ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు చేపట్టడం లేదు. పట్టణంలో నిత్యం లక్ష మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా సేకరించడంలో జరుగుతున్న జాప్యం వల్లే వ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం.

***పెరిగిన డెంగ్యూ కేసులు..***

ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు వేల మందికి డెంగ్యూ పరీక్షలు చేయగా చాలా మందికి పాజిటివ్ వచ్చింది. ఇప్పటివరకు 237 మందికి డెంగ్యూ నిర్ధారణ అయ్యింది. అయితే ఒక్క మోతీనగర్ పరిధిలో గురువారం 15 కేసులు రాగా శుక్రవారం మరో రెండు కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి డెంగ్యూ కేసులు చాలా వరకు పెరిగాయి. మోతినగర్, పీపీ యూనిట్, షాషాబ్‌గుట్ట, వెంకటేశ్వరకాలనీ, ఎదిర, క్రిష్టియన్‌పల్లి, తిమ్మసానిపల్లి, రామయ్యబౌలి, న్యూటౌన్, బండ్లగేరి ప్రాంతాల్లో డెంగ్యూ కేసులు ఎక్కువగా ఉంటున్నాయి.



లక్ష్మారెడ్డిని పరామర్శిస్తున్న మండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే ఆల

## లక్ష్మారెడ్డికి ప్రముఖుల పరామర్శ

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 13 : మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతాలక్ష్మారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా తిమ్మాజిపేట మండలం ఆవంచకు వెళ్లి మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని పలువురు ప్రముఖులు పరామర్శిస్తున్నారు. శుక్రవారం శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మాజీ ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి శ్వేతాలక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి లక్ష్మారెడ్డితోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు జోగు ప్రదీప్, రవీంద్రనాథ్‌రెడ్డి, వేము గోపాల్‌రెడ్డి నర్సిరెడ్డితోపాటు జడ్చర్ల, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.





లక్ష్మారెడ్డితో మాట్లాడుతున్న మహమూద్‌అలీ, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి